రైతుకు సాయం.. సాగుకు భరోసా

- ఖరీఫ్ సాగుకు ముందే అన్నదాతల ఖాతాల్లో 'వైఎస్సార్ రైతు భరోసా' సొమ్ము జమ
- మొదటి విడత నిధుల విడుదల
- నియోజకవర్గంలో 45,607 మంది అన్నదాతలకు లబ్ధి
- రైతుల ఖాతాల్లో రూ.25,08,42,500


వ్యవసాయ పనులు చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చి అన్నదాతల కష్టాలను తొలగించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. పంటల సాగుకు వారు ఇబ్బందులు పడకూడదని, వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి ఏటా రూ.13,500 రైతన్నల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు. ఇందులో భాగంగా తొలి విడతలో ఖరీఫ్ పంటల సాగుకు పెట్టుబడి సాయంగా గురువారం రూ.5,500 జమ చేశారు. ఇందుకు కర్నూలు జిల్లాలోని పత్తికొండ వేదికగా మారింది. నియోజవర్గంలోని 6 మండాలల్లోని 45,607 మంది అన్నదాతల ఖాతాల్లో ఈ ఏడాది మొదటి విడతగా పెట్టుబడి సాయం కింద రూ రూ.25,08,42,500 జమ చేశారు. దుక్కులు దున్నుకునేందుకు, విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ఈ మొత్తం అండగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

అర్హులందరికీ అందించేలా..

వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద ప్రభుత్వం ప్రతి ఏటా మూడు విడుతల్లో రూ.13,500 సాయాన్ని అందిస్తోంది. ఖరీఫ్ ప్రారంభానికి ముందు రూ.7,500, అక్టోబర్‌లో రూ.4వేలు, మిగిలిన రూ.2 వేలు జనవరిలో జమ చేస్తున్నారు. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడుతల్లో రూ. 6వేల చొప్పున జమ చేస్తోంది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న, కౌలుదారులకు రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

మండలాల వారీగా వైఎస్సార్ రైతు భరోసా మొదటి విడత లబ్ధిదారుల వివరాలు..

మండలం	లబ్ధి పొందిన రైతులు	విడుదలైన నిధులు
ఆళ్లగడ్డ	10,056	రూ. 5,53,08,000
రుద్రవరం	9,758	రూ. 5,36,73,000
చాగలమర్రి	7,155	రూ. 3,93,52,500
శిరివెళ్ల	8,739	రూ. 4,80,64,500
ఉయ్యలవాడ	5,839	రూ. 2,96,39,500
దొర్నిపాడు	4,510	రూ. 2,48,05,000
	45,607	రూ. 2,50,84,2500

ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుండటం ఆనందంగా ఉంది. వరుసగా నాలుగేళ్లుగా రైతు భరోసా వచ్చింది. గత ఏడాది వరి సాగులో మంచి దిగుబడులో వచ్చాయి. మద్దతు ధరకే ధాన్యం విక్రయించా. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు భరోసా మొదటి విడత సొమ్మును జమచేయాలని నిర్ణయించడం ఆనందంగా ఉంది. వచ్చిన సాయం పెట్టుబడికి ఎంతో ఉపయోగ పడుతుంది.

– భూపాల్ రెడ్డి, యర్రగుంట్ల

నిజంగా భరోసానే



ప్రభుత్వం అందజేసే రైతు భరోసా నగదు ఎంతో ఉపయోగకరం. ఒకప్పుడు విత్తనాలు కొనుగోలు చేసేందుకు, వానా కాలం పంటలు సాగు చేసుకునేందుకు ముందుగా ట్రాక్టర్లతో సేద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైతు భరోసా నగదు పెట్టుబడికి సాయంగా నిలుస్తోంది.

– వెంకటరాముడు, శెట్టివీడు

అర్హులెవరూ నష్టపోరాదు



అర్హులైన రైతులందరి ఖాతాల్లో ' వైఎస్సార్ రైతు భరోసా' పీఎం కిసాన్ కింద రూ.5,500 జమ చేస్తున్నారు. నగదు జమ అయినట్లు మెసేజ్ రాని వారు 'వైఎస్సార్ రైతు భరోసా' యాప్ ద్వార స్టేటస్ చూసుకోవచ్చు. అర్హులైన ఏ ఒక్క రైతూ నష్టపోకూడదనేది ప్రభుత్వ ఆలోచన. అవకాశాన్ని వినియోగించుకుని రైతులు మంచి దిగుబడులు సాధించాలి.

– రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ

సాగుకు ముందే రైతులకు పెట్టుబడి సాయం

- 'వైఎస్సార్ రైతు భరోసా' నిధులు విడుదల చేసిన సీఎం జగన్
- జిల్లాలో 2,19,791 మంది రైతుల ఖాతాల్లో రూ.120.97 కోట్లు జమ
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద 10,434 మంది రైతులకు రూ.10.22 కోట్లు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


ఏ.రైతు భరోసా చెక్కు విడదల చేస్తున్న కలెక్టర్, చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి


రైతులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, చైర్మన్

నంద్యాల: వైఎస్సార్ రైతుభరోసా 2023–24 ఆర్థిక సంవత్సరానికి తొలివిడత పెట్టుబడి సాయం కింద 2,19,791 మంది రైతులకు రూ.120.97 కోట్లు నేరుగా జమ చేశామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో నిర్వహించిన బహిరంగ సభలో వరుసగా 5వ ఏడాది మొదటి విడతగా వైఎస్సార్‌సీ రైతు భరోసా, పీఎం కిసాన్ సొమ్ముతో పాటు మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో వర్చువల్ విధానంలో కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కార్యక్రమాన్ని వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలివిడత పెట్టుబడి సాయం కింద 2,19,791 మంది రైతులకు రూ.120.97 కోట్లు నేరుగా జమ చేశామన్నారు. అలాగే మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 10,434 మంది రైతులకు రూ.10,22,44,548 జమ చేశారన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 45,607 మంది రైతులకు రూ.25.08 కోట్లు, బనగానపల్లిలో 42,005 మందికి రూ.23.11 కోట్లు, డోన్‌లో 36,429 మందికి రూ.20.04 కోట్లు, నందికొట్కూర్ లో 29,543 మందికి రూ.16.24 కోట్లు, నంద్యాలలో 24,527 మందికి రూ.13.50 కోట్లు, పాణ్యంలో 14,456 మందికి రూ. 7.95 కోట్లు, శ్రీశైలంలో 27,224 మందికి రు 15.02 కోట్లు, మొత్తం 2,19,791 మంది రైతులకు రూ. 120.97 కోట్ల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేశారని వివరించారు. అనంతరం రైతులకు వైఎస్సార్ రైతుభరోసా మెగా చెక్కు అందచేశారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాల స్టాళ్లను పరిశీలించారు.


ఓర్వకల్లు విమానాశ్రయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

క్లుప్తంగా

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయాలి

నంద్యాల(సిటీ): సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్ మేస్త్రీలు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆయుష్మాన్ భారత్, 0–5 సంవత్సరాల వయస్సు చిన్నారులు, బాలింతలు, డ్రైడే ఫ్రైడే, సంక్షేమ పథకాలతో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. అలాగే.. మున్సిపాలిటీలో చేపడుతున్న స్పెషల్ శానిటేషన్ పనులపై దృష్టి సారించాలని మేస్త్రీలను ఆదేశించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న షేక్‌మాబున్నిసా

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా అన్నారు. గురువారం స్థానిక 15వ వార్డులో కౌన్సిలర్ సన్నల అనూష ఆధ్వర్యంలో రూ.18.50లక్షలతో సీసీ డ్రైన్లు, కల్వర్టులు నిర్మించేందుకు భూమి పూజ చేశారు. మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, నాయకులు సన్నల సాయిరాం రెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీను, సంపత్, షాకీర్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఆళ్లగడ్డ: ప్రతి ఒక్కరూ వన సంరక్షణపై అవగాహన పెంచుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అవకాశం ఉంటుందని అటవీ అధికారి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. పర్యావరణ హిత జీవన శైలి మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం నూతల నార్త్ బీట్ ఆఫ్ నూతల సెక్షన్ పరిధిలోని గూబగుండం గ్రామంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. అధికారులు రామకృష్ణ, రాధమ్మ,సుధాకర్ ఉన్నారు.


రుద్రవరం: పర్యావరణ సంరక్షణకు అందరూ పాటు పడాలని అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ పర్యావరణహిత జీవణశైలి మాసోత్సవం వేడుకల్లో భాగంగా గురువారం రుద్రవరం రేంజి పరిధిలోని నూతల సెక్షన్ అధికారులు శ్రీనివాసరెడ్డి, ఎంఎం చెలిమ కూప్ ఫారెస్టర్ రాణెమ్మ, ఎఫ్‌బీఓ రామకృష్ణ, ప్రొటెక్షన్ వాచర్లు, సర్పంచ్ నిర్మలమ్మ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, ఇంటికో మొక్క చొప్పున పెంచాలని కోరారు.

73 శాతం పింఛన్ల పంపిణీ


ఆర్.పాంపల్లెలో పుల్లయ్య ఆచారికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, గృహ సారథి

ఉయ్యాలవాడ : మండలంలో మొదటి రోజు గురువారం వేకువజామున్నే గడప గడపకు వెళ్లి తలుపు తట్టి గృహసారథులు, వలంటీర్లు 2,647 మంది లబ్ధిదారులకు ఫించన్ సొమ్ము అందజేశారు. మండలంలో 3,781 మంది పింఛన్‌దారులుండగా రూ.1,03,62,250 మంజూరు కాగా, రూ.75,70,500 పంపిణీ చేయడంతో 73 శాతం పూర్తయినట్లు మండల పరిషత్ పరిపాలన అధికారి సత్యన్న తెలిపారు.

కోడి కూయక ముందే..


డబ్ల్యు.గోవిందిన్నెలో అచ్చమ్మకు ఇంటికి వెళ్ల పింఛన్‌అందజేస్తున్న వలంటీర్ రాంపుల్లయ్య

దొర్నిపాడు: ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారకముందే ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు వలంటీర్లు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం గురువారం కోడి కూయక ముందే మండలంలో 3,674 పింఛన్లు ఉండగా తొలిరోజే 3,396 మందికి పింఛన్లను అందజేశారు. కాగా కొందరు ఊళ్లల్లో లేని కారణంగా పింఛన్లు అందజేయలేదని ఎంపీడీఓ నాగఅనసూయ తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి


మృతి చెందిన రాజగోపాల్

రుద్రవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజగోపాల్(48)గురువారం మృతి చెందాడు. బుధవారం విధులు ముగించుకొని ఆర్టీసీ బస్సులో నంద్యాలకు బయలు దేరాడు.శిరివెళ్ల మెట్ట వద్దకు చేరుకోగానే బస్సు దిగే క్రమంలో ప్రమాద వశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించినా కోలుకోలేక మృతి చెందినట్లు సిబ్బంది తెలిపారు.

వైభవంగా స్వాతి వేడుకలు


నరసింహ స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగు పేటలో వెలసిన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, స్నపన తిరుమంజన సేవల అనంతరం స్వామివారిని పట్టు వస్త్రాలచే అలంకరించారు. అలాగే మహాలక్ష్మీ దేవి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలు జరిపించి, మహా మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ చేపట్టారు. అర్చకులు రామానుజాచారి, నిర్వాహకులు మధుసూధన్‌రాయల్ పాల్గొన్నారు.

ఏపీజీబీ అవతరణ దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు 18వ అవతరణ దినోత్సవ వేడుకలు గురువారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఏపీజీబీ ఏర్పడి 17 సంవత్సరాలు పూర్తి చేసుకుని 18వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందన్నారు. 2022–23 సంవత్సరం నాటికి రూ. 2568 కోట్ల డిపాజిట్లు, రూ. 2595 కోట్ల రుణాల వ్యాపారం నమోదు చేసిందన్నారు. అనంతరం బ్యాంకు సిబ్బందితో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సీనియర్ మేనేజర్లు తవురియానాయక్, వంశీకృష్ణ, మోహనరామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల (న్యూటౌన్): జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ క్రీడాకారులను అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ ట్రైనర్ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో గురువారం ఓ జిమ్‌లో సన్మానించారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ పట్టణానికి చెందిన భవనాశి పవన్, మనిశ్యాం గత నెల 27, 28 తేదీల్లో ఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్, బాడీబిల్డింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారన్నారు. పవన్ 50 కేజీల విభాగంలో రెండు బంగారు పతకాలు,మనిశ్యాం 60 కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించారన్నారు. వీరు త్వరలో దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. సుధాకర్, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

తోటల పెంపకానికి ప్రోత్సాహం

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి 75 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. 5 ఎకరాల్లోపున్న సన్న, చిన్న కారు రైతులు మామిడి, చీని, జామ, నిమ్మ, సపోటా, దానిమ్మ, కొబ్బరి, మునగ, సీతాఫలం, చింత, డ్రాగన్ ఫ్రూట్స్, గులాబీ, మల్లె తోటలు సాగు చేసుకునేందుకు వంద శాతం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. నర్సిపల్లె, బోడెమ్మనూరు, ఉయ్యాలవాడ, గోవిందపల్లె, తుడుమలదిన్నె, సుద్దమల్ల, రూపనగుడి గ్రామాల్లో 12 ఎకరాల్లో మునగ, కొబ్బరి, నిమ్మ, చీని తోటలు సాగు చేసేందుకు రైతులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

చాగలమర్రి: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.5.65 కోట్ల ఉపాధి హామీ పనులకు ఈ నెల 2వ తేదీ నుంచి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఆర్‌పీ నీలకంఠ, ఏపీఓ నిర్మల తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో గురువారం ఎస్‌ఆర్‌పీ ఆధ్వర్యంలో డీఆర్పీలు, టిఏలతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 802 పనులకు రూ.5.65 కోట్లు ఖర్చు చేశారన్నారు. అన్ని పనులను క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను బహిరంగ సభలో చర్చిస్తామని చెప్పారు.

కొనసాగుతున్న మున్సిపల్ ఉద్యోగుల బదిలీలు

నంద్యాల(సిటీ): జిల్లాలోని మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న పలు విభాగాల్లో బదిలీలు షురూ అయ్యాయి. బుధవారం రాత్రి నుంచి శాఖల వారీగా రీజనల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి బదిలీల ఆదేశాలు జారీ చేస్తున్నారు. గురువారం వెలువడిన బదిలీల్లో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్. వెంకటరామిరెడ్డి డోన్ మున్సిపల్ కమిషనర్‌గా, డోన్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకటేశ్వర్లును వెయిటింగ్‌లో ఉంచారు. జూనియర్ అసిస్టెంట్ విభాగంలో నంద్యాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.నిఖిల్ స్థానంలో ఆదోని మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న బీ.హనీఫ్ నంద్యాలకు బదిలీ అయ్యారు. డోన్ మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ ఇంద్రకరనీలమ్మ నంద్యాలకు బదిలీ అయ్యారు. ఇటీవల నంద్యాల మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన జూనియర్ అసిస్టెంట్ బీ.నాగబ్రహ్మం ఆత్మకూరుకు, ఆయన స్థానంలో యు.యుగంధర్ నంద్యాలకు బదిలీ అయ్యారు.

గ్రామ సచివాలయంలో చోరీ

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గురువారం ఉదయం విధి నిర్వహణలో భాగంగా కార్యాలయాన్ని శుభ్రం చేసే స్వచ్ఛ భారత్ స్కీం స్వీపర్లు రోడ్ల పుల్లయ్య, గోతి జయరాముడు వెళ్లగా అప్పటికే సచివాలయం తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. కార్యాలయం లోపలికి వెళ్లి చూడగా అందులోనున్న ఎల్ఈడీ టీవీ, కంప్యూటర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయాన్ని సర్పంచ్ ముడియం శివమ్మ భర్త నాయుడు, మాజీ సర్పంచ్ రమణారెడ్డికి తెలిపారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పంచాయతీ కార్యదర్శి సబియాకు సమాచారమిచ్చారు. ఆమె సచివాలయానికి చేరుకొని పరిశీలించి రైతు భరోసా కేంద్రానికి సిబ్బంది వేసిన తాళం కాకుండా వేరే తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. రైతు భరోసా కేంద్రం తెరచి చూడగా అందులో వాటర్ ప్యూరిఫైడ్ యూనిట్ చోరీకి గురైనట్లు గుర్తించి, గ్రామ మహిళా పోలీసు షాహీదా ద్వారా పోలీసులకు సమాచారం చేరవేశారు. అయితే చాగలమర్రి పోలీసులు మాత్రం చోరీపై తమకు సమాచారం అందలేదని చెబుతున్నారు.

రవాణా చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): రవాణారంగం మన్నాలంటే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రోడ్డు రవాణా భద్రత చట్టం రద్దు చేయాలని ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ కోరారు. గురువారం యూనియన్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెండా ఎగురవేశారు. సుంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్రీస్, ఆయిల్ ధరలు పెంచి రవాణా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం కుదేలు చేసిందన్నారు. నరసింహాకుమార్, లక్ష్మీనరసింహ, బాలస్వామి, అయూబ్ పాల్గొన్నారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): దేశానికి ఖ్యాతి తెచ్చిన క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు మాట్లాడుతూ.. న్యాయం చేయాలని క్రీడాకారిణులు ఆందోళన చేస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజలందరూ దేశానికి ఖ్యాతి తెచ్చిన క్రీడాకారిణులకు మద్దతు ఇవ్వాలని కోరారు. తోట మద్దులు, గౌస్, లక్ష్మణ్, వెంకటలింగం పాల్గొన్నారు.

139 గృహాలు మంజూరు

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామానికి నుడా రెండో విడత కింద 139 గృహాలు మంజూరయ్యాయని, వాటిని త్వరితగతిన నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ షఫీవుల్లా తెలిపారు. గురువారం గ్రామ సచివాయంలో సర్పంచ్ బంగారు షరీఫ్ అధ్యక్షతన లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ


విధుల్లో చేరిన శరత్‌కుమార్ రెడ్డి

రుద్రవరం: ఎస్‌ఐగా శరత్ కుమార్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన నిరంజన్‌రెడ్డి ఎమ్మిగనూర్ రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు శిరివెళ్ల నుంచి శరత్‌కుమార్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు.

శ్రీశైల దేవస్థానం ఉద్యోగుల బదిలీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలలో భాగంగా ఇతర దేవస్థానాలకు బదిలీలు చేసింది. శ్రీశైల దేవస్థానంలో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(పీఆర్వో)గా విధులు నిర్వహిస్తున్న టీ.శ్రీనివాసరావును శ్రీకాళహస్తి దేవస్థానానికి ఏఈవోగా బదిలీ చేసింది. అలాగే సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావును శ్రీకాళహస్తి దేవస్థానానికి, జూనియర్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసులును శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డిని మహానంది దేవస్థానానికి, ఎం.రాఘవేంద్రకుమార్‌ను శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ చేసింది. అలాగే నలుగురు జూనియర్ అసిస్టెంటులను ఇతర దేవస్థానాల నుంచి శ్రీశైల దేవస్థానానికి బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి గురువారం సందర్భంగాదేవస్థానం ఈఓ , అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించి దత్తాత్రేయ స్వామికి అభిషేకాది, అర్చనలు చేశారు.

ఉచిత విద్య

నంద్యాల(న్యూటౌన్): కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోనున్న విజ్ఞాన్ పీఠంలో 1- 10వ తరగతి వరకు ఉచిత విద్యనందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని బెస్త ఈరన్న, గంగాధర్‌లో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చదువుకోలేక ఇబ్బంది పడుతున్న పిల్లలను విజ్ఞాన పీఠంలో చేర్పించాలని పేర్కొన్నారు. ఉచిత విద్యాబోధనతో పాటు హాస్టల్ సదుపాయం ఉంటుందని, వివరాలకు సెల్ 9866715600 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యాలవాడ : సుద్దమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరీ, ఉయ్యాలవాడ 4వ అంగన్‌వాడీ కేంద్రంలో బీసీ–బీ కేటగిరీ కింద ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి శైలజ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఆపై చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 4వ తేదీలోపు దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

రుద్రవరం: మండలంలోని టి.లింగదిన్నెలో నూతనంగా నిర్మితమైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు వేద పండితులు విశ్వక్సేన ఆరాధన, మహా సంకల్పం, పుణ్యాహవాచనం, మత్సంగ్రహణం,రక్షాబంధనం, సోమ కుంభ స్థాపన, అంకురార్పణం, వాస్తు హోమం వంటి పూజలు నిర్వహించారు.

5,389 మంది రైతులకు లబ్ధి

ఉయ్యాలవాడ : ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతన్న చేతికి పెట్టుబడి సాయం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో గురువారం జమ చేసింది. వైఎస్సార్ రైతు భరోసా కింద మండలంలోని 5,389 మంది రైతులకు రూ. 4,04,17,500 5వ ఏడాది జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. వీరిలో 108 మంది కౌలు రైతులకు కూడా లబ్ధిపొందారని చెప్పారు.

'ఐటీఐ' ప్రిన్సిపాల్‌గా ప్రసాద్



నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి. ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో జరుగుతున్న బదిలీల్లో భాగంగా తాడిపత్రి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ఆయనను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

మహిళపై దాడి

దొర్నిపాడు: నలుగురు యువకులు బహిరంగంగా మద్యం సేవిస్తుండగా చూసిన ఓ మహిళ ఇక్కడ తాగొద్దని సూచించినందుకు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి దాడికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రంగయ్య తెలిపిన మేరకు వివరాలు.. మండల కేంద్రంలోని రావిచెట్టు రచ్చబండ వద్ద యనమల రాము, యనమల మురళీ, ఆనంద్, మధు ఉదయం మద్యం సేవిస్తున్నారు. ఇళ్ల మధ్య తాగడమేంటి? ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బీబీ అనే మహిళ చెప్పింది. దీంతో వారు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించి దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ స్పష్టం చేశారు.

పోగొట్టుకున్న సొత్తు రికవరీ

బొమ్మలసత్రం: ఓ మహిళ నంద్యాల పట్టణంలో గురువారం తన బ్యాగులో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలను పోగొట్టుకున్న ఐదు గంటల్లోనే రికవరీ చేసిన వన్‌టౌన్ పోలీసులను ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ సంజామల మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్వాతి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు పట్టణానికి చేరుకుంది. ఆటోనగర్ నుంచి ఆటోలో బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ తన బ్యాగు కనిపించకపోయే సరికి వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కృష్ణయ్య స్పందించి ఆటో ప్రయాణించిన మార్గాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆటో వద్దకు చేరుకొని తనిఖీ చేయగా బ్యాగు అందులోనే కనిపించింది. వెంటనే బాధితురాలికి ఆభరణాలను అందజేశారని వివరించారు.